# దిబ్బ రాజ్యంలో ప్రజాస్వామికం

ఇటీవల దిబ్బరాజ్యంలో ఎన్నికలు జరిగిన సంగతి అందరికీ తెలిసినదే. ఈ ఎన్నికలకు పూర్వం జరిగిన కొన్ని విషయాలు దాదాపు ఎవరికీ తెలియవు. దిబ్బ ప్రభువుగారు తమ రాజ్యంలో ఇంకా ఎన్నికలకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడలేదనీ, వోటు హక్కు వినియోగించుకోవాలిసిన ప్రజానీకంలో అనేక వేలమంది జైళ్ళలోనూ, అజ్ఞాతవాసంలోనూ ఉన్నారనీ వోటర్ల జాబితా తయారు చేయగా అయిదు వందలమంది పేర్లే నమోదు అయినాయనీ అందులో నూరు పేర్లకు పైగా అనుమానాస్పదంగా ఉన్నాయనీ కేంద్ర ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ప్రభువు వారి లేఖకు కేంద్ర ప్రభుత్వం జవాబు ఇచ్చేలోపుగా, ఆరు నెలలైనా తిరగకముందే అసంగతం జరిగింది. సంస్థానాధిపతుల సంఘంలో శ్రీవారికి సభ్యత్వం ఉన్నదనీ, వారికీ డబోరా మహారాజావారికీ మధ్య ఈ విషయమై కొన్ని ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయనీ ఒకానొక బొంబాయి విలేకరి ఒకానొక దేశద్రోహ పత్రికలో ప్రచురించాడు. తరువాత శ్రీవారి ఆప్తమిత్రుడినైన నేను బొంబాయి వెళ్ళటమూ, ఆ విలేకరిని కలుసుకుని అతనివద్ద ఉన్న ఫోర్జరీ లేఖలను తీసుకుని అతనికి కించిత్తు ఆర్థిక సహాయం చేసి రావటమూ, ఆ తరువాత శ్రీవారూ నేను స్వయంగా ఆ ఫోర్జరీ పత్రాలను పరశురామ ప్రీతి చెయ్యటమూ జరిగిపోయిందనుకోండి. ఏమైనా కేంద్రంవారు దిబ్బ ప్రదేశ ఎన్నికలు వాయిదా వెయ్యటం వాంఛనీయం కాదనీ, సక్రమంగా ఎన్నికలు జరగవలసిందేననీ తెలియబరిచారు.

దిబ్బ రాజ్యంలో బలమైన దేశభక్తుల పార్టీ ఉంది. అందులో నుంచి సహం మంది అధికార వ్యామోహులు ఎన్నికలకు ముందే చీలిపోయి ప్రజాస్వామిక పక్షం ఏర్పాటు చేశారు. మిగిలిన పన్నెండు మంది దేశభక్తులూ పోటీలేకుండా ఎన్నికలకు నిలబడటానికి ప్రయత్నిస్తున్నారు. ప్ర.స్వా. పార్టీవారూ, అలుగ్గడ్డ పార్టీవారూ, దురదగుండ పార్టీవారు, అజ్ఞాతంగా ఉన్న కమ్యూనిస్టుపార్టీ వారూ కూడా పోటీకి దరఖాస్తులు పెట్టి దేశభక్తుల పార్టీకి లేనిపోని శ్రమ కలిగించారు. అన్ని దరఖాస్తులకన్న ప్రజలను ఆశ్చర్యంలో ముంచింది శ్రీవారి దరఖాస్తు. శ్రీవారు దేశభక్తుల పార్టీ తరఫున ఆఖరు క్షణంలో నామినేషన్ సంపాదించారు. ఈ అపూర్వ సంఘటన గురించి రాస్తూ నేనన్న ముక్కలు చరిత్ర ప్రసిద్ధంగా ఉండగలవని ఆశిస్తున్నాను:

"దిబ్బ ప్రభువుగారు స్వతంత్ర భారత దేశంలో ప్రజాస్వామ్యానికి చేసిన అపూర్వమైన దోహదం, సేవా, మేలూ భారతీయులకు మరవరానివి. ఆయన తమకు తామై; తమకు అనేక లక్షల ఏళ్ళుగా భుక్తంలో ఉన్న హక్కులను త్యాగం చెయ్యటమేగాక, దేశభక్తుల పార్టీ తరఫున ఎన్నికకు నిలబడి తమ ప్రజలకు తమపైగల అపారభక్తి విశ్వాసాలను ప్రపంచానికి చాటనున్నారు. శ్రీవారి దేశభక్తినీ, ప్రజాభిమానాన్నీ ఇతర సంస్థానాధీశులు అనుకరింతురుగాక."

అయితేనేం? భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ అర్జునులవారికి చెప్పినట్టు జయాపజయాలు దైవాధీనాలు, వాటిని గురించి మానవుడు విచారించరాదు. అందుకనే ఒక మామూలు పాలెగాడు కమ్యూనిస్టు పార్టీ తరఫున శ్రీవారికి ఎదురుగా నిలబడి శ్రీవారి డిపాజిట్ పోయేటట్టుగా గెలిచినప్పుడు శ్రీవారు కించిత్తయినా విచారించలేదు; "మనకు కౌన్సిల్ ఉండనే ఉన్నది!" అనేశారు, అంతే!

దిబ్బ ఎన్నికలు ఒక విషయం కూడా రుజువు చేశాయి. దిబ్బ ప్రజలు ప్రజాస్వామికానికింకా సంసిద్ధులుగా లేరు. అందుచేతనే దేశభక్తుల పార్టీకి నూరింట 20 వోట్లు మాత్రమే వచ్చాయి. తదితర పార్టీలకు నూరింట 80 వోట్లు వచ్చాయి.

ఈ ఎన్నికలు ఇంకొక విషయంకూడా రుజువు చేశాయి. అదేమంటే ఎంత వెనుకబడి ఉన్న ప్రాంతంలో కూడా ప్రజాస్వామికానికి విజయం సాధించుకోవచ్చునని. ఇది ఎట్లా జరిగిందీ మనవి చేస్తాను. దిబ్బ రాజ్యంలో ఉన్న స్థానాలు 12. ఇందులో నాలుగు స్థానాలు దేశభక్తుల పార్టీకీ, మూడు స్థానాలు ప్ర.స్వా. పార్టీకీ, మూడు స్థానాలు కమ్యూనిస్టు పార్టీకీ, ఒక స్థానం అలుగ్గుడ్డ పార్టీకీ, మరొకటి దురదగొండి పార్టీకి వెళ్ళాయి. అయిదోవంతు వోటర్లతో మూడో వంతు స్థానాలు సంపాదించటానికి ఎన్నికల నిబంధనలు దేశభక్తులకు చాలా అనుకూలించాయి. కాని మహా వృక్షాల్లాంటి దేశభక్తులు ఓడిపోయారు.

కమ్యూనిస్టుల సంగతి శ్రీవారికీ నాకూ కూడా అంతుపట్టలేదు. "మనం వీళ్ళని మారణహోమం చేశాం. ఎంతోమందిని కాల్చేశాం. జైళ్ళలో కూడా హతం చేసేశాం. మన కాల్పులు సరిగా, సమగ్రంగా జరగలేదనటానికి వీల్లేదు. మనం కాల్చినవాళ్ళలో దాదాపు సగం మంది అయినా కమ్యూనిస్టులు కానివాళ్ళే. ఇంతకన్న జాగ్రత్త ఎక్కడ తీసుకుంటాం? కమ్యూనిస్టుల వేటలో ఎన్నో గ్రామాలు మొత్తంగా తగలబెట్టాం. ఎంతోమంది గ్రామస్థులను చిత్రవధ చేశాం. ఎంతోమంది స్త్రీ పురుషులను నగ్నంగా చేసి అవమాన పరిచాం, హింసించాం. మన పోలీసులు ఎంతోమంది స్త్రీలను చెరిచారు. ఇంత జాగర్తపడిన మీదట కూడా కమ్యూనిస్టులు మళ్ళీ లేచివచ్చి ఎన్నికలలో పాల్గొనటమేమిటి? ప్రజలు వాళ్ళ మొహం కూడా ఎరగకుండా వాళ్ళకి వోట్లు వెయ్యట మేమిటి? ఇక ప్రజాస్వామికం ఎట్లా బలపడుతుంది?" అన్నారు శ్రీవారు ఆశ్చర్యపోతూ.

"ప్రజలలో రాజభక్తి ఎప్పుడైతే నశించిందో, దేశభక్తి కూడా అప్పుడే నశించింది. రాజుల జోలికి పోవటంలో దేశభక్తులు చాలా పొరపాటు చేశారనాలి. ఇదే పూర్వం అయితే తమరు ఎన్నికలలో నిలబడ్డ మరుక్షణం ఫలితం తేలకపోనా? తమకు ఎదురుగా ఒక అభ్యర్థి నిలబడేనా? అందులోనూ ఊరూపేరూ లేని పాలెగాడూ! ఇదంతా దేశభక్తుల అసమర్థత కాదా!" అన్నాను.

"ఆ పాలెగాడి సంగతి నేను చూస్తాలే!" అన్నారు శ్రీవారు.

శ్రీవారి అపజయానికి ఇంకొక కారణం కూడా ఉంది. మేమే పొరపాటు చేశాం. శ్రీవారిని ఎదిరించిన అభ్యర్థులలో పాలెగాడు గాక దురదగొండి గాడొకడున్నాడు. ఎన్నికలింకా రెండు రోజులున్నాయనగా వాడు, అదృష్టం కలిసివచ్చి, పెద్ద భవంతి ఒకటి కట్టటం ప్రారంభించి ఏతత్కారణంగా ఆఖరు క్షణంలో పోటీనుంచి విరమించుకున్నాడు. లేకపోతే పాలెగాడికి పడ్డ వోట్లు చాలావరకు వాడికి పడిఉండునేమో. దురదగొండిగాడికి శ్రీవారు స్థలం ఊరికే ఇవ్వటమూ ఇంటికి కావలసిన మట్టీ, తాటాకులూ, బొంగులు దానం చెయ్యటమూ చాలా పొరపాటైపోయిందేమోనని నాకు అనిపించింది.

జరిగిందేదో జరిగిపోయింది. ప్రభుత్వం ఏర్పరచవలసి ఉంది. ఆఖరుకు దేశభక్తులే ప్రభుత్వం ఏర్పాటు చేస్తారన్న విషయం అందరికీ తెలిసినదే. కమ్యూనిస్టులూ, ప్ర.స్వా.లూ కలుస్తారని వదంతి బయలుదేరింది. కలిస్తే ప్రమాదం ఉంది.

"వాళ్ళ మొహం, వాళ్ళు కలవరులే" అన్నారు శ్రీవారు.

"ప్రభువువారు గమనించాలి. మన దేశంలో ప్రజాస్వామికం బతికేదీ చచ్చేదీ ఎన్నికల మీద కాదు ఆధారపడింది, ప్రభుత్వం ఏర్పాటు కావటం మీద!" అన్నాను.

శ్రీవారు అమూల్యమయిన తమ తలను పంకించారు.

"ఎన్నికలలో ప్రజాస్వామికం బాగానే రుజువయింది. మనం అసంతృప్తి చెందరాదు. ఒక దేశభక్తి అభ్యర్థికి ఒక బూతులో వచ్చిన వోట్లు ఆ బూతులో పోలయిన వోట్లకన్న ఎక్కువే ఉన్నాయి. ఇంతకంటె ఎన్నికలు ప్రజాస్వామికాన్ని ఎట్లా రుజువు చేస్తాయి?" అన్నారు శ్రీవారు.

నేను మటుకు సంతృప్తిపడలేదు. ఈ సంఘటన గురించి కొన్ని దేశ ద్రోహ పత్రికలు చేసిన వ్యాఖ్యానాలు నాకు సూదుల్లాగా గుచ్చుకున్నాయి. ఈ కమ్యూనిస్టులనూ, వారి తోటి ప్రయాణికులనూ చూస్తే నాకిదే మంట. తమకు ప్రతికూలంగా ఏ అన్యాయం జరిగినా వాళ్ళు పెద్ద రాద్ధాంతం చేస్తారు. అందులో ప్రజాస్వామిక శక్తుల విజయం ఉందన్నది పాటించరు.

"ఒకవేళ కమ్యూనిస్టులూ, ప్ర.స్వా. గాళ్ళు కలిస్తే దేశభక్తుల కార్యక్రమం ఏమిటి?" అని అడిగాను.

"మీరు ఒకటే జ్ఞాపకం పెట్టుకోండి. ప్రజాస్వామికం మన చేతిలో ఉన్నంతకాలమూ దేశభక్తులకు ఉపాయాలుండకపోవు. సముద్రమంత రాజ్యాంగం ఉన్నది. అది మనకు అక్కరకు రాకపోదు" అన్నారు శ్రీవారు.

"కమ్యూనిస్టులతో ప్ర.స్వా.లు చేరటం కల్ల." "కమ్యూనిస్టు ప్ర.స్వా.ల సంప్రదింపులు విఫలమైనట్టే." ఈ విధంగా శీర్షికలు పెట్టి రోజూ నేను మన ప్రత్యేక పత్రికకు వార్తగా పంపాను. "ప్ర.స్వా.లు దేశభక్తుల పార్టీలో చేరటానికి బ్రహ్మాండమైన కృషి, రాబోయే ప్రభుత్వంలో ప్ర.స్వా. లకు ఒక స్థానమా, రెండు స్థానాలా?" అనే శీర్షికతో నేను వార్త పంపిన రోజే వారికీ కమ్యూనిస్టులకూ సమాధానం కుదిరింది. స.ప్ర. (సమిష్టి ప్రజాస్వామిక) పార్టీ ఏర్పాటయింది. ఉన్న పన్నెండు మందిలోనూ ఆరుగురు ఏకమైనారు.

ఇది జరిగిన మర్నాడు అలుగ్గడ్డ పార్టీనాయకుడు ఒక ప్రకటన చేశాడు తమ అభ్యర్థి దేశభక్తులతో చేరుతాడని. దేశభక్తుల పార్టీ సంఖ్య అయిదుకు పెరిగింది. దురదగొండి సభ్యులు ఎటూ తేలలేదు.

దేశభక్తులే ప్రభుత్వం ఏర్పాటు చేస్తారని వదంతులు బయలుదేరాయి. ఈ పార్టీకి దిబ్బ దేశంలో నాయకుడు లేడు. ఈ లోటును నక్కలాచార్యులవారు తీరుస్తారని వదంతి పుట్టింది. చార్లుగారు ప్రసిద్ధవ్యక్తి. నివురులాటి మనిషి. పేరుమోసుకున్న దేశభక్తులు. మిగిలిన దేశభక్తుల కన్న రెండడుగులు వెళ్ళి దేశంకోసం దేశభక్తిని కూడా విసర్జించపూనుకున్న త్యాగధనుడు. ఈయన బహిరంగ సభలలో గంభీరోపన్యాసాలు చేస్తుంటే సభికులు వివశులై పాతచెప్పులు, తారు వగైరా ఖరీదుగల వస్తువులు ఈయనపై వర్షించిన సమయాలున్నాయి.

చార్లుగారు కర్మసన్యాసి. ఆయనకు ఇతరులలాగా లౌకికచింతన లేదు. తహసీల్దారు చెయ్యమంటే చేస్తాడు. డఫేదారు చెయ్యమంటే అదీ చేస్తాడు, పిట్టకథలు చెప్పటంలో ఏ హరిదాసుకూ తీసిపోడు. ఆయన దేశభక్తులపార్టీ నాయకుడు కావటం చాటుమాటున స్థిరపడగానే ఆయన ఇంటి ముందు వీధిలో దీపాల సంఖ్యా పోలీసుల సంఖ్యా పెంచబడింది. ఆ ఇంటికి వందగజాలు అటూ ఇటూ మనుష్యులు వొంగి నడవాలని పోలీసుశాఖ ఏర్పాటయింది. ప్రభుత్వ శాఖాధికారులు రోజూ ఆయన ఇంటికి వెళ్ళి పాదపూజచేసి తీర్థం పుచ్చుకు చక్కారాసాగారు. ఇదంతా చూసిన ప్రజలకు ఆయన దేశభక్తుల నాయకుడూ, దిబ్బ ప్రధానీ కాబోతున్నట్లు ముందే తెలిసిపోయింది.

కాకపోతే స.ప్ర. వారు గోలెత్తారు. దిబ్బ ప్రభుత్వం ఏర్పాటు చేసే హక్కు దేశభక్తులకూ, నక్కలాచార్లకూ లేదన్నారు. కాని వినిపించుకునేదెవరు? స.ప్ర. వారి మెజారిటీ కోసం ప్రజాస్వామికం ఆగబోతుందా!

దిబ్బ శాసనసభ సమావేశమయే రోజున దిబ్బ నగరం కళకళలాడింది, ఊరంతా పోలీసులు, తుపాకులూ, మరతుపాకులూ, ఫిరంగులూ అవీ పట్టుకుని నిలబడ్డారు. పోలీసుల వాన్‌లు 144వ సెక్షన్‌తో తిరిగి అరాచకం ఎక్కడా తల ఎత్తకుండా చూసింది. ఇంకో పోలీసు వాన్‌లో కొందరు వచ్చి శాసనసభ వాకిట్లో దిగారు. వీరు ఖైదీలు కాదు, దిబ్బ దేశభక్తి మంత్రివర్యులు.

శాసనసభలో చార్లుగారు చేసిన ప్రసంగం ప్రజలెన్నటికీ మరువలేదు.

"దేశభక్తులకు దిబ్బ ప్రభుత్వం ఏర్పాటు చేసే అర్హతలేదని కొందరంటున్నారు. నేను ప్రధానమంత్రి అయిన విధానాన్ని కొందరాక్షేపిస్తున్నారు. ఇటువంటి తుచ్ఛసందేహాలకు నేనిక్కడ సమాధానం ఇస్తూ కూచోదలచలేదు. అనుమానం ఉన్న వాళ్ళు రాజ్యాంగం చూసుకోండి. మీ అనుమానం తీరిపోతుంది. తీరిపోకపోతే భగవంతుణ్ణి ప్రార్థించండి.... నేను ప్రజలకు మొట్టమొదటి శత్రువును. నాకు ప్రజలు మొట్ట మొదటి శత్రువులు. వారికి ప్రజాస్వామికమంటే ఏమిటో తెలిసేవరకు నేను వారితో పోరాటం సాగిస్తాను. ఈ కమ్యూనిస్టులను నేను మారణహోమం చెయ్యందే ఈ అవతారం చాలించను. నేను వస్తుతః శాకాహారిని గాని కమ్యూనిస్టులను, పచ్చి కమ్యూనిస్టులను – తినటానికి నేను సంసిద్ధంగా ఉన్నాను. నాకు శాసన సభవారు –కమ్యూనిస్టులతో సహా – పూర్తి సహకారం యిస్తారని ఆశిస్తున్నాను."

చార్లుగారు ప్రసంగిస్తుండగా ఒక దేశభక్తుడికి నడుము విరిగిపోయింది. కమ్యూనిస్టులే ఈ దుండగం చేశారని మొదటగా వెలువడిన వార్త సరికాదు. చార్లుగారి మాటలకు పారవశ్యం చెందిన మరొక దేశభక్తుడు తన్మయత్వంలో ఈ దేశభక్తుణ్ణి వీపుపై చరిచాడు. గాయపడిన దేశభక్తుడు ఆస్పత్రిలో తిరిగి ఆరోగ్యం పొందుతున్నాడు. బై ఎలక్షన్ వస్తుందని దేశద్రోహులెవరైనా ఆశించే పక్షాన వారా ఆశలను వదులుకోవచ్చు.

వచ్చే దశాబ్దంలోనైనా, శతాబ్దంలోనైనా, సహస్రాబ్దంలోనైనా దిబ్బ దేశానికి మంచి భవితవ్యం ఉన్నది. అది అమెరికా బ్రిటన్‌ల లాటి ఆదర్శ ప్రజాస్వామిక దేశాల అడుగు జాడలలో పురోగమిస్తున్నది. ఏనాటికైనా దిబ్బ సామ్రాజ్యం ప్రపంచమంతటా విస్తరించవచ్చు. ఎవరు చూశారు?

***ముద్రణ: ఉదయిని, 15 మే 1952***